AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
11-3-2026 (Wednesday) MAIN EDITION

## కేసీఆర్ క్షమాపణ చెబితే రాజీనామా చేస్తా : కడియం




**అక్షరటుడే, హైదరాబాద్:** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై కేసీఆర్ క్షమాపణ చెబితే తాను రాజీనామాకు సిద్ధమని సవాల్ చేశారు. కడియం శ్రీహరిపై పార్టీ ఫిరాయింపు పిటిషన్‌ను స్పీకర్ కొట్టి వేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన స్పందించారు. స్పీకర్ తీర్పును స్వాగతిస్తున్నానన్నారు. తమపై వేసిన పిటిషన్లు చట్టబద్ధం కావన్నారు. పార్టీ ఫిరాయిస్తే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, కానీ తనకు ఇవ్వలేదని పేర్కొన్నారు. పార్టీ పరంగా బీఆర్ఎస్ ఎందుకు పిటిషన్ వేయలేదని ఆయన ప్రశ్నించారు. తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, కానీ అధినాయకత్వానికి దూరంగా ఉన్నామని చెప్పారు.

## కేంద్ర మాజీ మంత్రి కావూరు మృతి



**అక్షరటుడే, హైదరాబాద్:** కేంద్ర మాజీ మంత్రి కావూరు సాంబశివరావు (82) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఆయన తుది శ్వాస విడిచారు. సాంబశివరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జన్మించిన ఆయన కాంగ్రెస్ నుంచి తన రాజకీయ జీవితం ప్రారంభించారు. మచిలీపట్నం, ఏలూరు నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో జౌళిశాఖ మంత్రిగా పని చేశారు.

## విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం: చంద్రబాబు




అక్షరటుడే, ఏపీ: సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. గత 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తామని చెప్పారు.

## దుబాయ్ ఎయిర్‌పోర్టు సమీపంలో డ్రోన్ల దాడులు




అక్షరటుడే, నేషనల్ డెస్క్: పశ్చిమాసియాలోని పలు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. తాజాగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ల దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో నలుగురు గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రుల్లో ఒకరు భారత వ్యక్తి అక్కడి అధికారులు పేర్కొన్నారు. దీంతో అధికారులు సేఫ్టీ నోటీసు జారీచేశారు.

## విమానానికి తప్పిన ప్రమాదం




అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఎయిర్ ఇండియా విమానానికి పెనుప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి వెళ్లిన విమానం బుధ వారం థాయిలాండ్‌లోని ఫుకెట్ విమానాశ్రయంలో హార్డ్ ల్యాండింగ్ చేసింది. ఫ్లైట్‌లో 133 మంది ప్రయా ణికులు ఉన్నారు. నోస్ ల్యాండింగ్ గేర్ విరిగిపోయి విమానం రన్‌వే వెంట జారీ పోయిందని అధికారులు తెలిపారు.



## వారంలో యుద్ధం ముగుస్తుంది: కేఏ పాల్

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధం వారం రోజుల్లో ముగుస్తుందని కేఏ పాల్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్నది ప్రపంచ యుద్ధం అని ఆయన పేర్కొన్నారు. రష్యా, చైనా, నార్త్ కొరియా కలిసి అమెరికాపై అణుబాంబు వేయడానికి ప్లాన్ చేసిన వార్‌గా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ యుద్ధం ఈగోతో ప్రారంభం అయిందని.. దీనిని ఆపేందుకు ఇప్పటికే తాను అనేక మంది నేతలను కలిసినట్లు చెప్పారు.



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. వారు పార్టీ మారినట్లు ఆధారాలు లేవని చెప్పారు. పార్టీ ఫిరాయింపు కేసులో మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు ఆయన ఊరట ఇచ్చారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# అనర్హత పిటిషన్ల కొట్టివేత

■ స్పీకర్ కీలక నిర్ణయం.. ■ కడియం, దానంలకు ఊరట ■ పార్టీ మారినట్లు ఆధారాలు లేవన్న స్పీకర్

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ అనర్హత పిటిషన్లపై ఇటీవల విచారణ ముగిసింది. దీంతో స్పీకర్ తీర్పును రిజర్వ్ చేశారు. బుధవారం తీర్పు ప్రకటించారు. వారి అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు లేవని పేర్కొన్నారు. దీంతో 10 మంది ఎమ్మెల్యేలపై పిటిషన్లను కొట్టివేశారు.

### ఆధారాలు లేవని..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, సంజయ్, దానం, కడియం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ స్పీకర్‌ను కోరింది. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సుప్రీంను ఆశ్రయించింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని జూలైలో న్యాయస్థానం తీర్పు చెప్పింది. దీంతో విచారణ చేపట్టిన స్పీకర్ గతంలోనే 8 మందికి ఊరట కలిగించారు. వారు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, ఎమ్మెల్యేల జీతం నుంచి బీఆర్ఎస్‌కు పార్టీ ఫండ్ వెళ్తుందనే కారణాలతో పిటిషన్లను కొట్టివేశారు.

### ఎంపీగా పోటీ చేసినా..

పార్టీ మారిన వారిలో దానం నాగేందర్ కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారు. కడియం శ్రీహరి తన కూతురిని కాంగ్రెస్ ఎంపీగా గెలిపించుకున్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారు పదవి తీసుకున్నారు. అయినా కూడా స్పీకర్ వారికి ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మొత్తం 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు డిస్మిస్ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంలో గురువారం విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం స్పీకర్ తీర్పు చెప్పారు. దీనిపై కోర్టు ఎలా స్పందిస్తుందో చూడాలి.

### ప్రజాస్వామ్యంపై దాడి : కేటీఆర్

పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లిన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమే అని మండిపడ్డారు.



## గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణం

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. గవర్నర్‌గా తెలుగులో ప్రమాణం చేశారు.

## టెక్సాస్‌లో అమెరికా మొదటి ఆయిల్ రిఫైనరీ నిర్మాణం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. టెక్సాస్ రాష్ట్రంలోని బ్రౌన్స్‌విల్‌లో కొత్త ఆయిల్ రిఫైనరీ నిర్మించనున్నట్లు ప్రకటించారు. టెక్సాస్‌లో అమెరికా మొదటి ఆయిల్ రిఫైనరీ నిర్మాణంగా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా 'ట్రూత్'లో పోస్టు చేశారు. "అమెరికా నిజమైన ఎనర్జీ డామినెన్స్ వైపు మళ్లుతోంది. ఈరోజు నేను గర్వంగా ప్రకటిస్తున్నాను.. అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ కంపెనీ 50 ఏళ్లలో దేశంలో మొదటి కొత్త ఆయిల్ రిఫైనరీని టెక్సాస్‌లోని బ్రౌన్స్‌విల్‌లో ప్రారంభించనుంది" అని రాసుకొచ్చారు. భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేటు ఎనర్జీ సంస్థ రిలయన్స్ ఈ అపూర్వ పెట్టుబడి పెట్టనున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నుంచి దీనిపై ఇంకా అధికారిక స్పందన రాలేదు.



## దాడులు 20 రెట్లు పెరుగుతాయి..

### ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. హర్ముజ్ జల సంధిలో చమురు రవాణా అడ్డుకుంటే దాడులు 20 రెట్లు పెరుగుతాయని హెచ్చరించారు. ట్యాంకర్ షిప్పులకు అమెరికన్ నేవీ ఎస్కార్ట్గా వస్తుందని ప్రకటించారు. ఇరాన్ కీలక జలసంధిలో మైన్లను తొలగించకపోతే "ఇంతకు ముందు ఎన్నడూ చూడని స్థాయిలో" సైనిక చర్య ఉంటుందని హెచ్చరించారు.

## గ్యాస్ కొరతతో హాస్టళ్ల కీలక నిర్ణయం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తలతో భారత్‌లోని అనేక హోటళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్లపై ఆంక్షలు విధించింది. దీంతో మహా నగరాల్లోని వందలాది హోటళ్లు మూతపడ్డాయి. మరోవైపు కొన్ని హోటళ్లలో తక్కువ గ్యాస్‌త్ అయ్యే వంటలు మాత్రమే చేస్తున్నారు. తాజాగా గ్యాస్ సంక్షోభం హైదరాబాద్ నగరాన్ని సైతం తాకింది. ఐటీ కారిడార్‌లోని హాస్టళ్ల నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పూట టీ, దోశ, చపాతి, స్నాక్స్ మానేశారు. కేవలం భోజనం మాత్రమే పెడుతున్నారు.

## రెడ్‌డ్రెస్ అందాలతో కట్టిపడేస్తున్న మీనాక్షి

టాలీవుడ్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా మీనాక్షి చౌదరి పేరే వినిపిస్తోంది. అందం, అభినయం కలగలిపిన ఈ ముద్దుగుమ్మ వరుస హిట్లతో దూసుకుపోతోంది. సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా అమ్మడు చేసే సందడి అంతా ఇంతా కాదు. తాజాగా రెడ్ కలర్ డ్రెస్సులో మీనాక్షి షేర్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఎర్రటి డ్రెస్సులో మెరిసిపోతున్న ఆమెను చూసి ఫ్యాన్స్ మంత్రము గ్ధులవుతున్నారు.

- అక్షరటుడే, సినిమాడెస్క్




## తీవ్ర నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ప్రారంభమై భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 1,342 పాయింట్లు, నిఫ్టీ 394 పాయింట్లు నష్టపోయాయి. ఇన్వెస్టర్లు రూ. 4.92 లక్షల కోట్లు కోల్పోయారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. యుద్ధం ముగింపు దశకు చేరుకుంటోందని యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ చెప్పినప్పటికీ పశ్చిమాసియాలో దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. ఎఫ్ ఐఐలు భారీగా పెట్టుబడులు ఉపసంహరిస్తుండడం, క్రూడ్ ఆయిల్ ధరల్లో ఒడిదుడుకులు, రూపాయి బలహీనపడడం కారణాలతో దేశీయ స్టాక్ మార్కెట్ ఊచకోతకు గురయ్యింది. ప్రధానంగా బెంచ్ మార్క్ ఇండెక్స్‌లు భారీ నష్టాలతో ముగిశాయి.

## రూ.14,500లకే దక్షిణాది యాత్ర



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ సూపర్ ప్యాకేజీ తీసుకొచ్చింది. వేసవి సమీపించింది. త్వరలో కాలేజీలు, బడులకు సెలవులు ప్రారంభం కానున్నాయి. దీంతో చాలా మంది పలు పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించాలని భావిస్తారు. అలాంటి వారి కోసం ఐఆర్‌సీటీసీ దివ్య దక్షిణయాత్ర అరుణాచలం చిదంబరం పేరిట ఓ టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. ఈ ప్యాకేజీలో ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లు యాత్ర ఉంటుంది. టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాసుల్లో ప్రయాణించడానికి టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరుచ్చి, తంజావూర్, చిదంబరం ప్రాంతాలను యాత్రలో చుట్టి రావొచ్చు. టికెట్ రేటు రూ.14,500 నుంచి ప్రారంభం అవుతుంది. సికింద్రాబాద్ నుంచి మే 24న మధ్యాహ్నం 12 గంటలకు రైలు ప్రారంభం అవుతుంది. ఎకానమీ (స్లీపర్ క్లాస్) ఒక్కో టికెట్ ధర రూ.14,500. 511 ఏళ్ల మధ్య చిన్నారులకు రూ.13,500గా నిర్ణయించారు.